క్లుప్తంగా

పౌష్టికాహారం తీసుకోవాలి



డిచ్‌పల్లి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా ఐసీడీఎస్ పీడీ రసూల్‌బీ సూచించారు. మండలంలోని యానంపల్లి రైతువేదికలో బుధవారం మండలస్థాయి పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. పిల్లల తల్లులు పోషకాహారాన్ని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం సీమంతాలు, అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఇన్‌చార్జి డీసీపీవో స్వర్ణలత, సూపర్‌వైజర్లు సరిత, శ్రీప్రియ, బుజ్జి, సునీత, శోభ, రాధలక్ష్మీ, వరలక్ష్మీ, భాగ్యలక్ష్మీ, రాంబాబు, రంజిత్, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి



సిరికొండ: ఖమ్మం జిల్లాలో న్యూడెమోక్రసీ నాయకులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామంలో కుట్ర కేసులకు సంబంధించి రూపొందించిన వాల్ పోస్టర్లను ఆయన బుధవారం ఆవిష్కరించారు. కేసులను ఎత్తివేసి పోలీసుల అదుపులో ఉన్న వారందరిని విడిచి పెట్టాలని కోరారు. నాయకులు గంగారెడ్డి, రాజన్న, రమేష్, సురేష్, నడ్పెన్న పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

నిజామాబాద్ రూరల్: మండలంలోని గుండారం గ్రామంలో గిరిరాజ్ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఎన్ఎస్ఎస్ శిబిరం కొనసాగుతోంది. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఐదోరోజు బుధవారం వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై చర్చించారు. అనంతరం నర్సరీని సందర్శించారు. ఐసీఐ ఇందూర్ ప్రెసిడెంట్ మంజూకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ అదీప, సునీత, అధ్యాపకులు రాములు ఉన్నారు.

నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి




నిజామాబాద్‌నాగారం: అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని 'కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి' జాతీయ అధ్యక్షుడు జెర్రిపోతుల పరశురాం డిమాండ్ చేశారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని తెచ్చిపెట్టిన అంబేడ్కర్ చిత్రాన్ని కరెన్సీపై ఎందుకు ముద్రించడం లేదని ప్రశ్నించారు. కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రిస్తామని ప్రకటించిన పార్టీకే తమ మద్దతు ఉంటుందన్నారు.

కాయితీ లంబాడీల సమస్యలను పరిష్కరించాలి



నిజామాబాద్‌నాగారం: కాయితీ లంబాడీల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర లాభాన బంజారా సమాజ్ సేవా సంఘం అధ్యక్షులు తాన్‌సింగ్ నాయక్ డిమాండ్ చేశారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా లాభాన లంబాడీలు, కాయితీ లంబాడీలు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు బంతిలాల్, బిసన్‌లాల్ నాయక్, దర్బార్ నాయక్, బార్మమల్ నాయక్, పెంటయ్య, బలరాం, జమునదాస్, హనంత్‌రావు ఉన్నారు.

నిబంధనలు పాటించని బడులపై చర్యలు తీసుకోవాలి



నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా నడుపుతున్న బడులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం వారు నగరంలోని మండల విద్యాశాఖ అధికారికి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు రవీందర్, దేవిక, శివసాయి, ఆకాష్, మనోజ్ పాల్గొన్నారు.

• కొత్త భవనమా.. ముడుపులు చెల్లించుకోవాలి!

- ఖలీల్‌వాడీలో వసూల్ రాజా!
- మున్సిపల్ అనుమతులు ఉన్నా అతడి అనుమతి తప్పనిసరి

నగరానికి చెందిన రామన్న(పేరుమార్చం) ఖలీల్‌వాడీలో అన్ని నిబంధనల ప్రకారం భవనం నిర్మిస్తున్నారు. మున్సిపాలిటీ అనుమతి కూడా తీసుకున్నారు. ఎన్ని పర్మిషన్‌లు ఉన్నా సరే ఇక్కడ వసూల్‌రాజా అనుమతి లేకుంటే భవనం నిర్మించడం సాధ్యం కాదు. అతడికి రూ. 1లక్ష ఫీజు చెల్లిస్తే నిర్మాణానికి ఎలాంటి అడ్డంకులు ఉండవు. లేదంటే నిర్మాణదారులకు వేధింపులు తప్పవు. దీంతో రామన్న లాంటి వ్యక్తులు వారి వేధింపులతో ఆవేదన చెందుతున్నారు.



నిజామాబాద్‌నాగారం: నగరంలోనే ఖలీల్‌వాడీ అత్యంత ఖరీదైన ప్రాంతం. ఇక్కడ వ్యాపార వాణిజ్య సముదాయాలకు కొదువ లేదు. సుమారు 300లకుపైనే ఆస్పత్రులు, ల్యాబ్‌లు, ఎక్స్‌రే, మెడికల్ దుకాణాలు తదితర లెక్కలేనన్ని ఉన్నాయి. ఇలాంటి ప్రాంతంలో ఏ నూతన భవనం నిర్మించినా ఆ ప్రాంతానికి ప్రజాప్రతినిధే వసూళ్లకు పాల్పడడం చర్చనీయాంశంగా మారింది.

పార్టీలు మారుతూ..

గతంలోనే ప్రతిపక్ష పార్టీ నుంచి అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్‌లోకి చేరి నానా హంగామా చేశారు. అప్పట్లో ఈ వసూల్ రాజాపై కథనాలు రావడంతో అప్పటి ఎమ్మెల్యే గతంలోనే వార్నింగ్ ఇవ్వడంతో మౌనం వహించారు. ప్రస్తుతం మళ్లీ పార్టీ మారి వసూళ్లకు తెరలేపారు. ఎక్కడైనా భవనం నిర్మించాలంటే జీఎస్టీ మాదిరిగానే తనకు ట్యాక్సీ చెల్లించాలనే నిబంధన పెట్టి మరీ వసూళ్లు చేయడం సర్వత్ర విమర్శలకు దారితీస్తోంది.

ఆరోపణలు ఎన్నో..

గతంలో ప్రతి నెలా వసూల్ రాజా తన మనుషులను పెట్టి మరీ వసూళ్లకు పాల్పడ్డ విషయం అందరికి తెలిసిందే. అలాగే ప్రతి నెల ఆస్పత్రికి ఇంత చొప్పున అంటూ వసూళ్లు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఆ ప్రాంతంలో కొత్తగా భవనం నిర్మిస్తే వసూల్ రాజా అనుమతి తీసుకోవాలి. మున్సిపల్ అనుమతి ఉన్నా సరే. తన అనుమతి లేకుండా భవనం నిర్మాణ పనులు ముందుకు సాగవు. నిబంధనల ప్రకారం భవనం నిర్మిస్తే ఒక రేటు, కాస్త అటు, ఇటు అయితే మరో రేటు అంటు బహిరంగంగానే చెప్పేస్తారు. లేకుంటే భవనం ముందు అధికారులను పంపించి మరీ ఆపేసిన సంఘటనలు కోకోల్లలుగా ఉన్నాయి. దీంతో నిర్మాణదారులు ముందుగానే అతడికి రూ.లక్షల్లో ముడుపులు అందజేసి నిర్మాణాలు చేపట్టారు.

ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు..

నగరంలో భవనం నిర్మాణం విషయంలో ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దు. టీఎస్ బిపాస్ చట్టం ప్రకారం మున్సిపల్‌కు ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. అనవసరంగా ఎవరికీ డబ్బులు ఇవ్వకూడదు. నిబంధనల ప్రకారం భవనం నిర్మించుకోవాలి. – కరుణాకర్, టీపీవో

అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- పసుపు పంటకు మద్దతు ధర కోసం ఎంపీ అర్వింద్ కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఖలీల్‌వాడి: ఎంపీ అర్వింద్ ఐదేళ్లలో నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో చేసిన అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గతంలో జిల్లాలో 80 వేల ఎకరాల్లో పసుపు పండించగా, ప్రస్తుతం 50వేల ఎకరాలలో పండిస్తున్నారన్నారు. పసుపు పంటకు ధర లేకపోవడంతోనే రైతులు ఇతర పంటల వైపు మొగ్గు చూపుతున్నట్లు చెప్పారు. పసుపు రైతులకు కావాల్సిన గిట్టుబాటు ధర కోసం బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలన్నారు. ఇందుకోసం ఎంపీ అర్వింద్ కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కేంద్రం దేశవ్యాప్తంగా బీసీ గణన ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ గణనతోపాటు మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాలలో 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటి కాదని చెప్పడానికే ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేసి డ్రామా ఆడుతున్నారన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బీన్‌హందాన్, నేతలు బాడ్సి శేఖర్, మునిపల్లి సాయిరెడ్డి, ముప్పగంగారెడ్డి, వైశాఖ సంతోష్, కాలూర్ భోజన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి..



పెద్దమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కులాస్‌పూర్‌లో బుధవారం పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ముగిశాయి. వేడుకలకు ఎమ్మెల్యే హాజరై, ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం వీడీసీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. ఆర్అండ్‌బీ సీఈ మోహన్ నాయక్, గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, ఎల్లోల సాయిరెడ్డి, పృథ్వీరాజ్‌రెడ్డి, కోర్వ జైపాల్, వాల్గోట్ చిన్నారెడ్డి, లక్ష్మణ్, గంగారాం, బూస నారాయణ, చెన్నూరు గంగారెడ్డి, కర్ల సాయిరెడ్డి పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే

ఇందల్వాయి: మండలంలోని తిర్మన్‌పల్లి ఈద్గ వద్ద మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపీ ముదిరాజ్ బుధవారం ముస్లింలకు రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరై, ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శేఖర్‌గౌడ్, మునిపల్లి సాయిరెడ్డి, ముప్ప గంగారెడ్డి, నవీన్ గౌడ్, ఎంపీటీసీ షేక్ హుస్సేన్, చింతల కిషన్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

ముగిసిన బార్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న బార్ ఎన్నికల అధికారులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ బుధవారంతో ముగిసింది. వివిధ పదవులకు 12 మంది న్యాయవాదులు నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల అధికారులు అమిదాల సుదర్శన్, నారాయణ దాసు తెలిపారు. అధ్యక్ష పదవికి మామిల్ల సాయరెడ్డి, జగన్ మోహన్ గౌడ్ నామినేషన్లు పత్రాలను సమర్పించారు. ఉపాధ్యక్ష పదవికి పెంటెమ్ రాజు శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పదవికి సుదర్శన్ రావు, వసంత్ రావు, బాలరాజ్, సంయుక్త కార్యదర్శిగా దొన్‌పాల్ సురేష్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. కోశాధికారిగా దీపక్, లైబ్రరీ కార్యదర్శిగా పిల్లి శ్రీకాంత్ ఒకొక్కరు మాత్రమే నామినేషన్ వేశారు. క్రీడా,సాంస్కృతిక కార్యద ర్శిగా శీలం భాస్కర్ రెడ్డి, మహమ్మద్ ఆయూబ్ ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. మహిళ ప్రతినిదిగా ఏలేటి కవిత రెడ్డి ఒక్కరు నామినేషన్ వేశారు. నామినేషన్ల పరిశీలన అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని వారు తెలిపారు.

సినీకవిత్వంలో రాణిస్తున్న మల్లెగోడ

- పలు సినిమాల్లో పాటల రచన
- ప్రశంసలు పొందుతున్న ఇందూరు బిడ్డ



కేవీ రమణాచారి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న మల్లెగోడ గంగాప్రసాద్ (ఫైల్)

నిజామాబాద్ సిటీ: సినిమా ప్రపంచంలో చేరాలని ప్రతి కళాకారుడు కలలు కని, ఆ దిశగా ప్రయత్నాలు చేస్తుంటారు. కానీ నిలదొక్కుకొని అనుకున్న దిశలో ప్రయాణం చేయగలిగిన వాళ్లు తక్కువే. కానీ, నేటి తరానికి ప్రతినిధిగా, యువకవిగా రాణిస్తూ, జాతీయకవిగా గౌరవం పొందిన నగరంలోని అర్సపల్లికి చెందిన మల్లెగోడ గంగాప్రసాద్ ప్రస్తుతం సినీపాటల రచయితగా మెరుస్తున్నాడు. ఇటీవల విడుదలై మంచి సినిమాగా గుర్తింపు పొందిన 'షరతులు వర్తిస్తాయి' అనే సినిమాలో పాటతో కవిత్వాన్ని పండించాడు మల్లెగోడ. అంతకుముందు యూట్యూబ్‌లో అనేక పాటలతోపాటు, 'గోల్డ్ మెడలు' సినిమాకు పాటలు రాసి మెప్పించాడు. నేడు 'అంతర్జాతీయ కవితా దినోత్సవము' సందర్భంగా ఈ యువ కవి ప్రస్థానం విశేషాలు ఇలా..

యాది సినిమాతో..

తెలంగాణ ఉద్యమం సమయంలో హైదరాబాద్‌లో తన స్నేహితుడితో కలిసి స్టూడియోకు వెళ్లగా 'యాది' అనే సినిమాకు టైటిల్ సాంగ్‌ను అప్పటికప్పుడు రాసి ఇచ్చారు. ఈ సాంగ్ బాగా గుర్తింపు పొందింది. ఇక అక్కడి నుంచి మై విలేజ్ షో వారు తీసే ప్రతి వెబ్ సిరీస్‌లో మల్లెగోడ పాటలు రాసాడు. కన్నడ పొట్టి చిత్రం తెలుగులోకి అనువాదం ప్రేమంటే ఇదేరా పేరుతో అనువాదం అయ్యింది. ఇప్పటివరకు మల్లెగోడ దాదాపు వందకి పైగా పాటలు రాయగా, అందులో 25కు పైగా సంగీత రూపం దాల్చటం గమనార్హం.

జాతీయ కవిగా గుర్తింపు...

సినీ ప్రయాణంలో గోరటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, కాసర్ల శ్యాం, పింగళి చైతన్య, పెద్దింటి అశోక్ వంటి వారు తనకు గురుతుల్యులని మల్లెగోడ తెలిపారు. 2024 జాతీయ కవిగా గుర్తింపు పొందారు. పెద్ద తెర మీద తనకు తొలిసారి అవకాశం కల్పించిన 'షరతులు వర్తిస్తాయి' సినిమా దర్శకుడు అక్షర కుమార్‌కు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. తన గురువు కాసర్ల నరేశ్‌రావును ప్రతి అడుగులో గుర్తు చేసుకుంటానని తెలిపారు.

మహిళా సాధికారతే ధ్యేయం



నిజామాబాద్‌రూరల్: మహిళా సాధికారత ధ్యేయంగా పనిచేయాలని జిల్లా డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ రవీందర్ పేర్కొన్నారు. మండలంలోని పాంగ్రా మహిళా సమాఖ్య భవనంలో మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం అమ్మ ఆదర్శ పాఠశాలల్లో స్త్రీనిధికి చెందిన మండలాధ్యక్షులను పాఠశాలకు చెందిన హెచ్ఎంను అనుసంధానం చేస్తు నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ రంగ సంస్థలకు యూనిఫారాలను కుట్టించే విధంగా మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అదేవి ధంగా పాఠశాలల్లో మౌలిక వసతుల పర్యవేక్షణకు అమ్మ కమిటీలు ఎంతో దోహదపడుతాయని ఆయ న వివరించారు. డీపీఎంలు శ్రీనివాస్, మారుతి, సాయిలు, నిలిమా, సంధ్యరాణి, ఏపీఎంలు మహేశ్, ప్రసాద్, రవీందర్, ఉమాకిరణ్, సరోజని పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

డిచ్‌పల్లి: అకాల వర్షాలు, వడగళ్ల వానలతో పంటలు దెబ్బతిన్న బాధిత రైతులను ఆదుకోవాలని, వెంటనే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు బుధవారం ఆయన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డికి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి లేఖలో కోరారు.

పశువులకు టీకాలు

సిరికొండ: మండలంలోని చిన్నవాల్గోట్ గ్రామంలో బుధవారం గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశు వైద్యాధికారి బాబురావు వేశారు. జీపీ కార్యదర్శి శరణ్య, సిబ్బంది శ్రీనివాస చంద్రశేఖర్, సతీష్, రంజిత్ పాల్గొన్నారు.

కులగణనతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): కులగణనతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమని, తద్వారా అన్ని కులాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి పేర్కొన్నారు. మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో బుధవారం మాదిగ జేఏసీ జిల్లా నాయకులు బరికుంట శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. కుల గణన చేయకుండా బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ హామీని నెరవేర్చిన తర్వాతనే బీజేపీ ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. నాయకులు తెడ్డు గంగారాం, ఎంహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్, సోమనాథ్, యాదయ్య, నాగేందర్, పిల్లి విజయ్‌కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

మైనారిటీ సంక్షేమానికి కృషి



ఖలీల్‌వాడి: రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ అన్నారు. నగరంలోని మాలపల్లికాలనీ డీలక్స్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేసి, ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

మోపాల్: గ్రామాల్లో పారిశుధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు దృష్టి సారించాలని ఎంపీడీవో లింగం సూచించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధిహామీ పనులు, బీసీ రుణాల పరిశీలన, నర్సరీల్లో మొక్కల జెర్మినేషన్ తదితర అంశాలపై పలు సూచనలు, సలహాలు చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీఓ సునీత, ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

నియామకం



నిజామాబాద్‌నాగారం: జిల్లా మేరు సంఘం నాయకులు కొట్టూరు చంద్రకాంత్ తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు బెల్లాపు దుర్గారావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర కార్యవర్గానికి చంద్రకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

కార్పొరేషన్ల చైర్మన్లకు సన్మానం



డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి: రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఈరవత్రి అనిల్ ఇటీవల నియమితులయ్యారు. ఈసందర్భంగా బుధవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని ఆయన నివాసంలో అనిల్ కలిశారు. అనిల్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. అలాగే జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆ ధ్వర్యంలో ఈరవత్రి అనిల్‌ను, సహకార సంఘాల యూనియన్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు సన్మానించారు. నాయకులు గోర్త రాజేందర్, రాజారెడ్డి, రఘుపతి రెడ్డి, సందీప్, అల్లూరి సాయిరెడ్డి, నీ రజ్, భూపతిరెడ్డి, బేల్దారి రాజన్న, సదానంద్ యా దవ్, సుధాకర్ పాల్గొన్నారు.



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో బుధవారం రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బీన్‌హందాన్‌ను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సన్మానించారు. నాయకులు మునిపల్లి సాయిరెడ్డి, వైశాక్షి సంతోష్, బాడ్సిశేఖర్‌గౌడ్, ముప్పగంగారెడ్డి, భోజన్న ఉన్నారు.

మేడిచర్లకు కీర్తి పురస్కారం


నిజామాబాద్ సిటీ: హైదరాబాద్ పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి కీర్తి పురస్కారాన్ని జిల్లాకు చెందిన మేడిచర్ల ప్రభాకర్‌రావు అందుకున్నారు. పద్య రచన విభాగంలో ప్రతిభ చాటడంతో ఆయనకు కేవీ రమణాచారి పురస్కారాన్ని అందజేశారు. సభ అధ్యక్షుడు తంగెడ కిషన్‌రావు, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి ఉన్నారు.

దాణా, నీటి తొట్టీల పంపిణీ



సుభాష్‌నగర్: నగరంలోని వినాయక్‌నగర్ లోగల మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా పలువురికి బుధవారం పిచ్చుకల దాణా, నీటి తొట్టీలు (పరికరాలు) పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ మాట్లాడుతూ.. పక్షి జాతిని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆయన కోరారు.ట్రస్ట్ సభ్యులు మంచాల శ్రీలక్ష్మీ, హరిణి, చిదుర పద్మ, కిరణ్మయి పాల్గొన్నారు.

బీడీ కమీషన్ రేట్ పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న బీడీ కమీషన్‌దారులు

నిజామాబాద్ సిటీ: బీడీ కమీషన్‌దారులకు ఇచ్చే కమీషన్ రేట్లను పెంచాలని కమీషన్‌దారులు డిమాండ్ చేశారు. కమీషన్‌దారులకు ఇచ్చే కమీషన్ రేట్ల ఒప్పందం గడువు ఈ నెలా 31తో ముగుస్తున్నందున నూతన ఒప్పందం చేసుకొనుటకు చర్చలకు పిలువాలని కోరారు. ఈమేరకు బుధవారం వారు నగరంలోని బీడీ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడికి వినతిపత్రం ఇచ్చారు. అలాగే కమీషన్ ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. బీడీలు చుట్టే కార్మికులు ఆ కంపెనికి సంబంధించిన కార్మికులుగా గుర్తించబడుతారని, కార్మిక శాఖ నుంచి పొందవలసిన లేబర్ లైసెన్స్ ఫీజు డబ్బులు న్యాయంగా యా జమాన్యాలే భరించాలన్నారు. నాయకులు కేఎస్ స్వామి, ప్రధాన కార్యదర్శి నారాయణ, ఉపాధ్యక్షుడు నర్సయ్య, సహాయ కార్యదర్శి పరమేశ్వర్ ఉన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



నిజామాబాద్‌రూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డీఈవో దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని మాధవనగర్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. రానున్న పరీక్షల్లో చక్కగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని విద్యార్థులకు వివరించారు. అంతకు ముందు డీఈవో ఉదయం ప్రార్థనలో పాల్గొన్నారు.

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	06	12	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	50	80
జీరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	16	30
జిర్నిసుకాయ	30	60	గోబిగడ్డ	30	50
కాకరకాయ	40	60	గోబిపువ్వు	50	70
వంకాయ	40	60	బీట్‌రూట్	20	40
పాలకూర	10	20	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	50	70	గోరుచిక్కుడు	50	70
పుదీనా	40	60	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్సింగ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ప్రేమలు (తెలుగు) - 1.30, 4.40, గామి (తెలుగు) - 4.30, 10.30
స్క్రీన్-2	రజాకార్ (తెలుగు) - 10.40, భీమా (తెలుగు) - 1.40, 4.30, 7.40 యోధ (హిందీ) - 10.40
స్క్రీన్-3	రజాకార్ (తెలుగు) - 1.30, 4.30, 7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	యోధ (హిందీ) - 10.10, 1.10, 10.10, షరతులు వర్తిసాయి - 4.10 ఇట్ట కిట్ట (గుజరాతీ) - 7.10
స్క్రీన్-2	కుంగ్ ఫూ పాండా (ఇంగ్లీష్)-12.05, 2.25, 8.00 ప్రేమలు - 4.45 రజాకార్ (తెలుగు) - 10.20
స్క్రీన్-3	గామి (తెలుగు) - 10.25, 7.20 సైతాన్ (హిందీ) - 1.35 లంబసింగి (తెలుగు) - 4.35, బస్తర్ (ది నక్సల్ కథ) 10.30
స్క్రీన్-4	తంత్ర (తెలుగు) - 10.30 బస్తర్ (ది నక్సల్ కథ) 1.25, భీమా (తెలుగు) 4.15, సైతాన్ (హిందీ) - 7.20 ప్రేమలు - 10.15
దేవి	ప్రేమలు (తెలుగు)
నటరాజ్	తంత్ర (హిందీ)
లలితామహల్	భీమా (తెలుగు)
విజయ్	రజాకార్ (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	67,300	వెండి (కిలో)	78,500
22 క్యారెట్స్	62,067		

– నిజామాబాద్ బిజినెస్